APTEL 2009/31957
# నీలగిరి వార్త
మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక
neelagirivartha@gmail.com
ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : గుంటోజు విష్ణుమూర్తి సంపుటి 20 సంచిక 39 శనివారం 24 అక్టోబర్ 2026 పేజీలు 8 వెల- 5 రూ



## రానున్న పది నెలలు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి


2లో

## లబ్ధిదారుల ఇంటి వద్దకే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు



- కమలాపూర్ మండలంలోని 12 గ్రామాల్లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పర్యటన
- వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఆర్థిక చేయూత

కమలాపూర్, నీలగిరి వార్త

వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందజేశారు. కమలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.మండలంలోని భీంపల్లి, కన్నూరు,

మిగతా 2లో

## రిజర్వాయర్ నుంచే డిండి ప్రాజెక్టుకు నీళ్లు..
# అచ్చంపేట లిఫ్ట్‌కూ జలాలు

- శ్రీశైలం నుంచి అదనంగా 0.6 టీఎంసీల ఎత్తిపోతలు
- ప్రతిపాదనలు సిద్ధం చేయండి- సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- త్వరలో మహారాష్ట్ర సీఎంతో భేటీ.. తమ్మిడిహట్టిపై చర్చలు



హైదరాబాద్, నీలగిరి వార్త

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన ఏదుల రిజర్వాయర్ నుంచే డిండి ప్రాజెక్టుకు నీళ్లను తరలించాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అచ్చంపేట ఎత్తిపోతల పథకాన్ని కూడా అక్కడి నుంచే చేపట్టాలని స్పష్టం చేశారు. రెండు లిఫ్ట్‌లకు కావాల్సిన

మిగతా 2లో



## 26న ఎన్టీఆర్ వర్సిటీ రూబీ జూబ్లీ వేడుకల

- దేశంలోనే తొలి ఆరోగ్య విశ్వవిద్యాలయంగా గుర్తింపు
- 40 వసంతాలు పూర్తి
- హాజరు కానున్న ఉపరాష్ట్రపతి, గవర్నర్, చంద్రబాబు
- వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్

2లో

# పట్టభద్రుల ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టాలి


మిగతా 2లో

- క్షేత్రస్థాయిలో గ్రాడ్యుయేట్లను కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి
- డివిజన్ల వారీగా ఎమ్మెల్సీ ఎన్నికల బాధ్యుల నియామకం
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించాలి:
- బోయినపల్లి వినోద్ కుమార్

# ఆరు నెలల వ్యవధిలోనే ఆర్థిక వినాశనం

2లో

- గ్యారెంటీల లెకలను కాగ్ నుంచే దాచిపెట్టిన రేవంత్ సరార్
- ఆర్థిక పరిస్థితిపై అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేయాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజుశ్రవణ్ డిమాండ్



# లీనినో ప్రభావంతో చిన్నగా మొదలైన కరువు సమస్య.. జూలై దాకా కరువే!

- అప్పటికి సాధారణ వర్షపాతం నమోదైతేనే ఊరట
- రానున్న 9 నెలలూ అత్యంత ప్రమాదకర పరిస్థితులు
- ఎండాకాలం తాగడానికి చుక్కనీరు దొరక్కపోవచ్చు
- ఈ పరిస్థితిని దాచితే క్యాన్సర్‌లా తయారవుతుంది
- రానున్న ముప్పును ప్రజలందరికీ వివరించండి
- నాటి విపత్కరం కరోనా.. నేటి విపత్కరం ఎల్‌నినో
- కాంగ్రెస్ తెచ్చిన కరువంటూ హరీశ్‌రావు చేస్తున్న
- తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలి
- సంక్రాంతి తర్వాత ప్రజలకు పని కల్పించేందుకు
- ప్రత్యేక ప్రణాళిక.. నేతలంతా గ్రామాలకు వెళ్లాలి
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,
- కాంగ్రెస్ ముఖ్య నేతలతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్, నీలగిరి వార్త

ఎల్‌నినో ప్రభావంతో చిన్నగా మొదలైన కరువు సమస్య.. వచ్చే ఏడాది జూలై వరకూ కొనసాగనుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ కరువు ప్రభావంతో రానున్న 9 నెలలూ అత్యంత ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొనబోతున్నామని చెప్పారు. వేసవికాలంలో బయటకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడతాయని, తాగటానికి చుక్క నీరు కూడా దొరకని పరిస్థితి రాబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిజాన్ని దాచి పెడితే క్యాన్సర్‌లా బాధపడాల్సి వస్తుందని,

మిగతా 2లో

# టీఆర్ఎస్ మీడియా సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బానోత్ వెంకన్న నాయక్

- 15 ఏళ్ల మీడియా అనుభవానికి దక్కిన గుర్తింపు
- గిరిజన జర్నలిస్టుల సంక్షేమం కోసం పోరాడిన నాయకుడికి కీలక బాధ్యత
- నియామక ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత



హైదరాబాద్,నీలగిరి వార్త

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) మీడియా సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బొల్లెపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు బానోత్ వెంకన్న నాయక్ నియమితులయ్యారు. తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రకటించిన వివిధ కమిటీల్లో భాగంగా ఆయనకు ఈ కీలక బాధ్యత అప్పగించారు.

గత 15 సంవత్సరాలుగా వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తూ జర్నలిజం రంగంలో విశేష అనుభవాన్ని సంపాదించుకున్న వెంకన్న నాయక్, గిరిజన జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. గతంలో ట్రైబల్ జర్నలిస్టు యూనియన్‌ను స్థాపించి గిరిజన జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ కోసం పలు పోరాటాలు నిర్వహించారు.

జర్నలిస్టుల సంక్షేమం, సామాజిక సమస్యలపై ఆయన చూపిన చొరవ ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.తెలంగాణ రక్షణ సేన ఆవిర్భావం నుంచి సంస్థ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. గతంలో

- మిగతా 2లో పేజీలో

# నవంబరు నుంచి చింతలపూడి పనులు పునఃప్రారంభం

లక్ష్యంగా జల వనరుల శాఖ పనిచేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.. రాష్ట్రంలో గుర్తించిన 36 ప్రాధాన్య ప్రాజెక్టుల నిర్మాణాన్ని నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని, 2028 డిసెంబరు నాటికి అన్ని ప్రాజెక్టులనూ అందుబాటులోకి తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు, ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం ఉన్న కాలువల వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. కాలువలపై సౌర విద్యుత్ ఫలకాలు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. జల హారతి కార్పొరేషన్ ద్వారా జల వనరుల శాఖకు ఆదాయాన్ని సమకూర్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**పోలవరం కాలువల ద్వారా నేవిగేషన్ వ్యవస్థ:**

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో సాంకేతిక అంశాల విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రామాణిక కార్యాచరణ విధానం ప్రకారం పనులు చేపట్టాలని, అత్యుత్తమ నిపుణులను నియమించి ఎప్పటికప్పుడు నిర్మాణ పనులను పర్యవేక్షించాలని సూచించారు. చారిత్రక ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్నందున నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రాజెక్టులో ఇప్పటివరకు 90.2 శాతం సివిల్ పనులు పూర్తి అయినట్టు అధికారులు సీఎంకు వివరించారు. ప్రధాన కట్టడమైన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌లో గ్యాప్-1, గ్యాప్-2 పనులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. నిపుణుల కమిటీ పలుమార్లు ప్రాజెక్టును సందర్శించి నిర్మాణ పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల పనులను 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కాలువల ద్వారా గరిష్ఠ స్థాయిలో నీటిని తరలించేలా వాటి సామర్థ్యాన్ని పెంచాలన్నారు. ప్రాజెక్టు వద్ద నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జిని పూర్తి చేసి రాకపోకలతోపాటు పర్యాటక అభివృద్ధికి అవకాశాలు కల్పించాలని సూచించారు. గోదావరి--పెన్నా అనుసంధానంపై కార్యాచరణ ప్రారంభించాలని, గోదావరి నుంచి కావేరి వరకు నీటిని తరలించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రకాశం బ్యారేజికి ఎగువన, దిగువన వైకుంఠపురం, చోడవరం వద్ద ఆనకట్టల నిర్మాణం ద్వారా 14 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలన్నీ క్రియాశీలంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాలువల వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు, భద్రాచలం నుంచి రాజమహేంద్రవరం, విజయవాడ మీదుగా విశాఖపట్నం వరకు అంతర్గత జల రవాణాకు అవసరమైన నావిగేషన్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

**జలధార--జలహారతి నిరంతర కార్యక్రమం;**

జలధార--జలహారతి రెండో దశ పనులను మార్చి 31 వరకు కొనసాగిస్తూ, 150 రోజుల కార్యక్రమంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఉపాధి హామీ పథకం వీబీజీ రామ్ జీతో అనుసంధానం చేసి పనులు చేపట్టాలన్నారు. కొనసాగిస్తూ వర్షపు నీటిని ఒడిసి పట్టాలని, చెరువులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలను పెంచాలని చెప్పారు. వర్షపాతం తక్కువగా ఉన్నా ప్రకృతి వ్యవసాయం ద్వారా స్థూల వ్యవసాయ ఉత్పత్తి తగ్గకుండా చూడాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాధాన్యతా క్రమంలో చేపట్టే 36 ప్రాజెక్టులతో పాటు ఉత్తరాంధ్రలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ నిర్దేశిత గడువులో పూర్తి అయ్యేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు.

## 26న ఎన్టీఆర్ వర్సిటీ

# రూబీ జూబ్లీ వేడుకల

అమరావతి, దేశ వైద్య విద్యారంగంలో ఒక చారిత్రక అధ్యాయాన్ని లిఖించిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 40 ఏళ్ల మైలురాయిని పురస్కరించుకుని రూబీ జూబ్లీ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ ప్రతిష్ఠాత్మక ఉత్సవాలకు భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.
ఈ వివరాలను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ శుక్రవారం విజయవాడలో మీడియాకు వెల్లడించారు. దేశంలోనే మొట్టమొదటి ఆరోగ్య విశ్వవిద్యాలయంగా 1986 నవంబర్ 1న ఏర్పాటైన ఈ సంస్థ, 2026 నవంబర్ 1 నాటికి 40 వసంతాలు పూర్తి చేసుకోనుందని ఆయన తెలిపారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, అక్టోబర్ 26వ తేదీ సోమవారం విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో రూబీ జూబ్లీ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు. గత నాలుగు దశాబ్దాలుగా లక్షలాది మంది వైద్యులను, ఆరోగ్య నిపుణులను దేశానికి అందించిన ఘనత ఈ విశ్వవిద్యాలయానికి దక్కుతుందని వీసీ చంద్రశేఖర్ కొనియాడారు. 40 ఏళ్ల ప్రస్థానాన్ని ప్రతిబింబించే ప్రత్యేక సావనీర్‌విశ్వ విద్యాలయం నాలుగు దశాబ్దాల ప్రస్థానం, సాధించిన విజయాలు, వైద్య విద్యారంగానికి అందించిన సేవలను ప్రతిబింబించేలా ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరించనున్నట్లు వైస్ ఛాన్సలర్ వెల్లడించారు. ఈ చారిత్రక వేడుకలకు అనుబంధ కళాశాలల నుంచి వెయ్యి మందికి పైగా వైద్య విద్యార్థులు, వివిధ విభాగాల అధిపతులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ రూబీ జూబ్లీ వేడుకలు విశ్వవిద్యాలయ చరిత్రలో చిరస్మరణీయంగా నిలవనున్నాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ టి. సాయి సుధీర్, పరిశోధన, అభివృద్ధి విభాగం డైరెక్టర్ డా. సూర్య ప్రభ, ప్రచురణల విభాగం డైరెక్టర్ డా. కె. సుధ పాల్గొన్నారు.

## రిజర్వాయర్ నుంచే డిండి ప్రాజెక్టుకు నీళ్లు..

# అచ్చంపేట లిఫ్ట్‌కూ జలాలు



0.6 టీఎంసీల జలాలను, అదనంగా శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఎత్తిపోసుకొనేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. ఎంసీహెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో ఇరిగేషన్ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు.
ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రు లు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, ఉన్నతాధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. తమ్మిడిహట్టి బరాజ్‌తోపాటు డిండి, అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టులపై పీటముడిగా ఉన్న అంశాలన్నింటిపై చర్చించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ్మిడిహట్టి బరాజ్ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉండాలని, త్వరలోనే చర్చలకు ఆహ్వానిస్తానని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఇటీవల తెలిపారని వెల్లడించారు. ఆ చర్చలకు సంబంధించిన వివరాలన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, ఇటీవల ఢిల్లీలో సమావేశం సందర్భంగా సీడబ్ల్యూసీ కోరిన సమాచారాన్ని అందజేయాలని అధికారులను ఆదేశించారు.
ఏదుల నుంచే డిండి, అచ్చంపేట లిఫ్ట్‌లు
డిండి ప్రాజెక్టుకు నీటిని నార్లాపూర్ నుంచి తీసుకోవాలా? ఏదుల నుంచి తీసుకోవాలా? అనే అంశంలో మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల ప్రతినిధుల మధ్య కొనసాగుతున్న వివాదాలు, అభ్యంతరాలు, విజ్ఞప్తులపై ఈ సమీక్షలో చర్చించారు. ఎక్కడినుంచి తరలిస్తే ఎంత ఖర్చవుతుంది? తదితర వివరాలన్నీ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

## ఆరు నెలల వ్యవధిలోనే

# ఆర్థిక వినాశనం



హైదరాబాద్, అక్టోబర్ 23 : రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఆరు నెలల వ్యవధిలోనే (ఏప్రిల్-సెప్టెంబర్ 2026) తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసిందని, శాసనసభ సాక్షిగా చేసిన అంకెల గారడీ మొత్తం కాంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తాజా అర్ధవార్షిక నివేదికతో బట్టబయలైందని బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన అసమర్థ పాలన, అడ్డగోలు అప్పులతో ఖజానాను ఖాళీ చేసి, రాజ్యాంగబద్ధ ఆడిట్ సంస్థలకే తప్పుడు లెకలు చెప్తూ రాష్ట్రాన్ని దివాలా అంచున నిలబెట్టారని విమర్శించారు.'నాయకత్వానికి కావలసింది ప్రజలకు ఉపయోగపడే పదునైన ఆలోచనలు, అంతేకాని పసలేని రాజకీయ ఆరోపణలు కావు.

కొత్త ఆదాయ మార్గాలను వెతకకుండా, ఉన్న ఆస్తులను కరిగిస్తూ పోవడం వల్ల తెలంగాణ భవిష్యత్తుకు తీరని నష్టం జరుగుతుంది. ఇప్పటికైనా రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంవైపు నెట్టకుండా సరైన నిర్ణయాలు తీసుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదాయం పెంచే తెలివి లేక, ఉన్న ఆస్తులను కరిగించేస్తూ తెలంగాణ పిల్లల భవిష్యత్తును అప్పుల పాలు చేస్తున్నది' అని మండిపడ్డారు. సెప్టెంబర్ నెల కాగ్ నివేదిక విడుదలైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ లోపాలపై శుక్రవారం దాసోజు ఒక ప్రకటనల విడుదల చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో రూ.6,857.76 కోట్ల రెవెన్యూ మిగులు సాధిస్తామని అసెంబ్లీలో డాంబికాలు పలికిందని, కానీ ఆరు నెలల్లోనే ఆ అంచనా పూర్తిగా తలకిందులై, ఏకంగా రూ. 15,096.18 కోట్ల భారీ రెవెన్యూ లోటులోకి రాష్ట్రం కూరుకుపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# లబ్ధిదారుల ఇంటి వద్దకే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు

గుండేడు, కాశింపల్లి, మర్రిపెల్లిగూడెం, మర్రిపల్లి, శనిగరం, గోపాలాపూర్, గూనిపర్తి, అంబాల, గూడూరు, శంభునిపల్లి గ్రామాల్లో పర్యటించి అర్హులైన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య చికిత్సల కోసం అధిక మొత్తంలో ఖర్చు చేసి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద,

మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా వారి ఇళ్ల వద్దకే వెళ్లి చెక్కులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తామని, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. వైద్య ఖర్చుల భారంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం కొంత ఊరటనిస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సంపత్ రావు, మాజీ జడ్పీటీసీ నవీన్, ఇంద్రసేనారెడ్డి, సత్యనారాయణరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ జావీద్, ఆయా గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టాలి

హనుమకొండ, అక్టోబర్ 23
వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పట్టభద్రుల ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టాలని మాజీ ఎంపీ, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎన్నికల వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోయినపల్లి వినోద్ కుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో గ్రాడ్యుయేట్లను నేరుగా కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని, అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డివిజన్ల వారీగా ఎమ్మెల్సీ ఎన్నికల బాధ్యులను నియమించి, ఓటరు నమోదు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.
వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బోయినపల్లి వినోద్ కుమార్‌ను నియమించిన సందర్భంగా శుక్రవారం హనుమకొండలోని అలంకార్, కాకతీయ కాలనీలో ఉన్న ఆయన నివాసంలో సమావేశం నిర్వహించారు. మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలపై చర్చించారు.
ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదు విషయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో అర్హులైన గ్రాడ్యుయేట్లను గుర్తించి, వారిని ఓటర్లుగా నమోదు చేయించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. పార్టీ తరఫున పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## టీఆర్ఎస్ మీడియా సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బానోత్ వెంకన్న నాయక్

జూబ్లీహిల్స్ జెండా పండుగ కార్యక్రమానికి అబ్జర్వర్‌గా కూడా ఆయనను కల్వకుంట్ల కవిత నియమించారు. మీడియా రంగంలో ఆయనకున్న అనుభవం, సంస్థ పట్ల నిబద్ధతను గుర్తించి తాజాగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.
నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా: వెంకన్న నాయక్
ఈ సందర్భంగా బానోత్ వెంకన్న నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మీడియా సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవితకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మీడియా అనేది ప్రజలకు, నాయకత్వానికి మధ్య వారధిగా పనిచేసే శక్తివంతమైన వ్యవస్థ అని పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ తెలంగాణ రక్షణ సేన బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ప్రజల సమస్యలను నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు సంస్థ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, ముఖ్యంగా గిరిజన జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు.

తన నియామకానికి సహకరించిన రూప్‌సింగ్ నాయక్, కిషన్ నాయక్, శ్రీకాంత్ గౌడ్, మాధవిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# లీనినో ప్రభావంతో చిన్నగా మొదలైన కరువు సమస్య.. జూలై దాకా కరువే!

అందుకే దాచకుండా ప్రజలకు చెప్పాలని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ ముఖ్యనాయకులకు సూచించారు.
శుక్రవారం వారితో ప్రజాభవన్‌లో ఎల్‌నినో పరిస్థితులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, ఢిల్లీలో ఎస్ఐఆర్ వ్యతిరేక ర్యాలీకి సన్నద్ధతపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులపై గత ఆరు నెలల నుంచీ ప్రజల్ని అప్రమత్తం చేస్తూ వస్తున్నామని గుర్తు చేశారు. "ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువంటూ హరీశ్‌రావు రాజకీయ దురుద్దేశంతో కూడిన ప్రకటనలు చేస్తున్నడు. యూకేతో సహా ప్రపంచంలోని వంద దేశాల్లో ఎల్‌నినో ప్రభావం ఉంది. ఒక్కో ఊరు.. ఒక్కో మండలం, ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలాగా దీని ప్రభావం ఉండవచ్చు. తెలంగాణలోనే ఉత్తర తెలంగాణలో ఒకలాగా.. దక్షిణ తెలంగాణలో మరోలా ఉంది. ఏపీలో ఒకలా, మహారాష్ట్రలో మరోలా, కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లో ఇంకో రకంగా ఉంది. ఈ వంద దేశాలకు, ఇన్ని రాష్ట్రాలకు చెందిన వారంతా హరీశ్‌రావు కంటే తెలివి తక్కువోళ్లా? గత 75 ఏళ్లలో చూడని కరువు ఇది. అత్యంత అభివృద్ధి చెందిన దేశాలూ ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. మహారాష్ట్రలోని కచ్ ప్రాంతంలో ఇప్పటికే ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తూ.. అందులోనూ రేషన్ విధానం పెట్టారు. ప్రతి మనిషీ తన నీటి వినియోగం కనీసంగా 20 శాతం తగ్గించుకోవడం తప్పనిసరి చేస్తూ మార్గదర్శకాలను రూపొందిస్తున్నారు" అని సీఎం రేవంత్ వివరించారు.

**తాగునీటికీ కటకట తప్పదు..**

ఎల్‌నినో ప్రభావంతో ఎండ వేడిమి పెరిగి.. ఉన్న నీరు ఆవిరి అవుతూ ఉంటుందని, సాగునీటి మాట అటుంచి తాగునీటికీ కటకట ఏర్పడుతుందని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు అవగాహన కల్పించకుండా కరువు పరిస్థితిని ఎదుర్కొనడం అసాధ్యమన్నారు. అందుకే ఈ అంశాన్ని శాసనసభలో చర్చకు పెట్టడమే కాకుండా మంత్రివర్గ ఉపసంఘాన్నీ వేశామని తెలిపారు. గతంలో కరోనాపై కేసీఆర్ బాధ్యత లేని మాటల వల్లే వేలాది మంది చనిపోయారని రేవంత్ ఆరోపించారు. కరోనా వచ్చినప్పుడు ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ బాధ్యత లేకుండా వ్యవహరించారన్నారు.

"శాసనభలో కరోనాపై చర్చ సందర్భంగా 30 డిగ్రీల ఎండ కొడితే కరోనా చచ్చి ఊరుకుంటదని, ఎక్కువైతే పారాసిటమాల్ వేసుకుంటే పోతుందంటూ కేసీఆర్ దబాయించి మాట్లాడిండు. చివరకు ఏమైంది? లక్షల మంది చనిపోయారు. కరోనాతో చనిపోయిన వారిని దహనం, ఖననం చేయడానికి స్మశానాల్లో చోటు దొరకని పరిస్థితి ఏర్పడింది. కేసీఆర్‌ను దైవాంశ సంభూతుడని బావించి.. కరోనాపై ఆయన బాధ్యత లేని మాటలను నమ్మి బయటికి వెళ్లినవారు స్మశానానికి వెళ్లారు. నమ్మని మనం.. ఇక్కడ సమావేశంలో కూర్చుని మాట్లాడుకుంటున్నం" సీఎం వ్యాఖ్యానించారు.

# రానున్న పది నెలలు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి

**నీటి వృధా లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్**

దేవరకొండ నీలగిరి వార్త, రానున్న పది నెలల పాటు గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సర్పంచులు, గ్రామ కార్యదర్శులతో కోరారు.

గ్రామాల్లో పైపులైన్ లీకేజీలు ,ఇతరత్రా నీటి వృధా లేకుండా నివారించి నీటి వృధా లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కోరారు.శుక్రవారం దేవరకొండా లోని ఒక ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో "ఎల్‌నినో ప్రభావం– తీసుకోవలసిన చర్యలపై సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఎల్ నినో వల్ల వాతావరణ మార్పుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నీటి వనరులను కాపాడుకోవడం అత్యంత అవసరమన్నారు. గ్రామాల్లో చెరువులు, మిషన్ భగీరథ, బోర్లు, కాలువలు, వర్షపు నీటి ద్వారా లభించే నీటి నిల్వలపై ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని గ్రామాలలో అందుబాటులో ఉన్న నీటి వనరులు, నీటి నిల్వల వివరాలను గ్రామ కార్యదర్శులు తెలుసుకుని, వాటిని రానున్న నెలల్లో అవసరాలకు సరిపడా వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. జూలై వరకు నీటి కొరత రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

నీటి సంరక్షణ చర్యలలో భాగంగా గ్రామాలలో పైపులైన్ లీకేజీలను అరికట్టాలని, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీరు, సాగునీటికి ఎంత అవసరమో అంతే వినియోగిస్తూ నీటి పొదుపు సూత్రాలను ప్రజలు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు.

విద్యుత్తును కూడా పొదుపుగా వినియోగించి





సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కోరారు.రానున్న రోజుల్లో తక్కువ నీటితో పండించే ఆరుతడి పంటలైన సజ్జలు, జొన్నలు, మినుములు, కందులు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సుమారు 30 మంది రైతులు ఒక సమూహంగా ఏర్పడి సమిష్టి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సహించాలని, పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో కూలీలకు పని కల్పించాలని, పశుసంపదను సంరక్షిస్తూ పశువులకు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, గ్రామాలలో ఉపాధి పనులను విస్తృతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత ఉన్నచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, ఎంపీడీవోలు పర్యవేక్షణ బాధ్యత తీసుకోవాలని చెప్పారు. చేపట్టిన పనులకు కొలతల పుస్తకాల ప్రకారం బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గ్రామీణ ప్రజలకు అవసరమైన రేషన్ సౌకర్యాలు అందుబాటులో ఉండేలా కొత్త పంచాయతీల్లో రేషన్ షాపుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలలకు సంబంధించిన పెండింగ్ బిల్లుల పరిష్కారానికి కూడా చర్యలు చేపడతామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావాన్ని ప్రకృతి వైపరీత్యంగా భావించి, సమష్టి కృషితో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ సర్పంచులతో కలిసి క్రింద కూర్చుని వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో ఎల్‌నినో ప్రభావం నివారణ, నీటి పొదుపుపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్తి యాన్ మావి,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ట్రైనీ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్ , పశు సంవర్ధక శాఖ అధికారి జివి రమేష్, డిపిఓ తరుణ్ చక్రవర్తి, ఇంచార్జ్ఎంపీడీవో పార్వతి, అధికారులు, సర్పంచులు, సెక్రటరీలు పాల్గొన్నారు .

# రైతుల వద్దకు వెళ్లి భూ సమస్యలను పరిష్కరించాలి

**భూ సర్వే వివరాలను గ్రామసభల్లో చదివి వినిపించాలి**

**మహిళా సంఘాలు బంజరు భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలి**

**నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి**

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**





దేవరకొండ నీలగిరి వార్త, రైతుల భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులతో ముఖాముఖి మాట్లాడి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. భూములకు సంబంధించిన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు. మహిళా సంఘాలు బంజరు భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకొని విద్యుత్‌ను విక్రయించడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, పశువుల ద్వారా గోబర్ గ్యాస్ తయారీని ప్రోత్సహించాలని తెలిపారు. శుక్రవారం ఆయన దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట మండలం, పొగిళ్ల, కంబాలపల్లి గ్రామాల్లో భూ సర్వే నిర్వహించిన ప్రాంతాలను సందర్శించారు. శుక్రవారం సూర్యోదయానికి ముందే క్షేత్రస్థాయికి చేరుకున్న ఆయన రైతులతో నేరుగా మాట్లాడి భూ సర్వే వివరాలు, భూముల విస్తీర్ణం, రికార్డులు, అభ్యంతరాల గురించి అడిగి తెలుసుకున్నారు.

పొగిళ్ల గ్రామంలో సర్వే నంబర్ 2లో 1,066 ఎకరాల భూమిని సర్వే చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గ్రామంలో వాస్తవంగా సాగులో ఉన్న భూమి, అసైన్డ్ భూములు , భూములపై హక్కులు కలిగిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూ సర్వేకు సంబంధించిన వివరాలను గ్రామంలో ప్రదర్శించాలని, అవసరమైతే గ్రామసభలో చదివి వినిపించాలని ఆదేశించారు.ఇప్పటివరకు వచ్చిన అభ్యంతరాలు , వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలేమిటని అధికారులను ప్రశ్నించారు. మొత్తం 30 అభ్యంతరాలు వచ్చినట్లు అధికారులు తెలిపా రు. భూముల రికార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు, పహాణీ వివరాలు, క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణాన్ని సరిపోల్చి పరిశీలించాలని సూచించారు. భూములపై అభ్యంతరాలు వ్యక్తం చేసే రైతులు తమకు సంబంధించిన ధ్రువపత్రాలను చూపించాలని తెలిపారు.

అసైన్డ్ భూములను చట్టవిరుద్ధంగా అమ్మడం, కొనడం చేయకూడదని స్పష్టం చేశారు. సర్వే వివరాలను పారదర్శకంగా ప్రజలకు తెలియజేసి, అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.రైతులతో చర్చించి భూ సమస్యలను పరిష్కరించేందుకుకంబాలపల్లి రైతు వేదికలో రైతులతో కలెక్టర్ సమావేశమయ్యారు. సర్వే నంబర్ల వారీగా భూ సర్వే ఎంతవరకు పూర్తయింది, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిగిందా, ఇంకా ఎన్ని సర్వేలు చేయాల్సి ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సర్వే నంబర్ 37, 50లకు సంబంధించిన సర్వే వివరాలను పరిశీలించి, పూర్తయిన సర్వే వివరాలను గ్రామసభల్లో ప్రదర్శించాలని సూచించారు. సర్వే రికార్డుల్లో ఉన్న వివరాలు, పహాణీలో నమోదైన పేర్లు, వాస్తవంగా భూములు అనుభవిస్తున్న రైతుల వివరాలను సరిపోల్చాలని ఆదేశించారు. వచ్చిన అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి, మిగిలిన సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

భూముల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉన్నా, రికార్డుల్లో తేడాలు కనిపించినా సంబంధిత రైతులు, అధికారులు కలిసి చర్చించుకోవాలని సూచించారు. అన్నదమ్ములు, ఇతర భూహక్కుదారుల మధ్య సమస్యలు ఉంటే పరస్పరం కూర్చొని మాట్లాడుకొని పరిష్కరించుకోవాలని అన్నారు. అన్ని వివరాలు సక్రమంగా ఉన్నవారికి నిబంధనల ప్రకారం పట్టాదారు పాసుపుస్తకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని,ఎల్‌నినో ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షాలపై ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. భూగర్భ జలాలు తగ్గే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటలకు అవసరమైన నీటిని మాత్రమే వినియోగించాలని, ప్రతి నీటి చుక్కను పొదుపు చేయాలని తెలిపారు.నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని తక్కువ నీటితో సాగు చేయగల పంటలు, కూరగాయల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. పశుసంపదను కాపాడుకుంటూ, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచుకోవాలని అన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలనిగ్రామాల్లో అందుబాటులో ఉన్న బంజరు భూములను ఉపయోగించుకొని మహిళా సంఘాలు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి విక్రయించడం ద్వారా మహిళా సంఘాలు ఆదాయాన్ని పెంచుకొని ఆర్థికంగా బలోపేతం కావచ్చని తెలిపారు.

అలాగే పశువుల పేడతో గోబర్ గ్యాస్ తయారు చేసుకొని ఇంధన అవసరాలను తీర్చుకోవడంతో పాటు వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. రైతులు, గ్రామీణ ప్రజలు అనవసర ఖర్చులను తగ్గించుకొని, పొదుపు అలవాటును పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలియన్ చింగ్ థియాన్ మావి, ల్యాండ్ సర్వే ఏడి దేవరాజ్ , తహసిల్దార్ సత్యనారాయణ, సర్పంచ్ జటా జైహింద్ నాయక్ , మండల సర్వేయర్లు శ్రీనివాస్,హరీష్, కంబాలపల్లి సర్పంచ్ గోవిందు,రైతులు, గ్రామస్తులు కలెక్టర్ వెంట ఉన్నారు .

# పోలీసుల విధులపై విద్యార్థులకు అవగాహన

**– గట్టుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం**

**– పోలీసుల పనితీరు, విధి నిర్వహణలో ఉపయోగించే పరికరాలపై వివరణ**



గట్టుప్పల్, నీలగిరి వార్త ప్రతినిధి అక్టోబర్ 23:
పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గట్టుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఎస్సై సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గట్టుప్పల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పనితీరు, పోలీసుల విధులు, బాధ్యతలు, ప్రజలకు అందించే సేవల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసుల విధులు.. పరికరాల వినియోగంపై వివరణ పోలీస్‌స్టేషన్‌లో విధులు ఎలా నిర్వహిస్తారు? ఫిర్యాదులు అందినప్పుడు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు చేపడతారు? అనే అంశాలను విద్యార్థులకు వివరించారు. విధి నిర్వహణలో పోలీసులు ఉపయోగించే వివిధ పరికరాలను పరిచయం చేసి, వాటి వినియోగం, ప్రాధాన్యాన్ని తెలియజేశారు. పోలీసుల దైనందిన విధులు, నేరాల నియంత్రణ, ప్రజల రక్షణలో పోలీస్‌శాఖ పోషించే పాత్రను వివరించారు.పోలీసులపై అవగాహన.. సమాజంపై బాధ్యత ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీస్‌శాఖ పనితీరుపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. పోలీసుల విధులు, ఎదురయ్యే సవాళు ్లు, సమాజంలో శాంతిభద్రతలను కాపాడేందుకు వారు చేసే కృషిని తెలుసుకునే అవకాశం కల్పించారు. చిన్నతనం నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, క్రమశిక్షణతో మెలగాలని, సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు పెంపొందించడంతోపాటు విద్యార్థుల్లో పోలీస్‌శాఖపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, సుదర్శన్, స్వరూప్ సింగ్, నందిని, తదితరులు ఉన్నారు.

# వేములపల్లి పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం

**పోలీసు అమరవీరుల త్యాగాలు, పోలీస్ స్టేషన్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన**





నీలగిరి వార్త /అక్టోబర్ 23/నల్గొండ జిల్లా ప్రతినిధి :శంకర్ పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేములపల్లి పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పోలీస్ అమరవీరుల త్యాగాలు, ప్రజల రక్షణలో పోలీసులు నిర్వహించే విధుల గురించి ఎస్ఐ వి సురేష్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్, స్టేషన్ రైటర్ గది, ఎస్‌హెచ్ఓ గది, పాపిలాన్ పరికరం, సీసీ కెమెరాల పనితీరుతో పాటు అల్లర్ల నియంత్రణకు ఉపయోగించే రక్షణ పరికరాలను విద్యార్థులకు పరిచయం చేశారు. పోలీస్ శాఖ విధులు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రను వివరించి, పోలీసుల సేవలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వివిధ విభాగాల పనితీరును తెలుసుకున్నారు. పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ కార్యక్రమం ద్వారా సందేశం ఇచ్చారు.

# అంతర్జాతీయ కరాటే పోటీల్లో కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాల విద్యార్థికి పసిడి పతకం



కరీంనగర్ ప్రతినిధి నీలగిరి వార్త శ్రీలంకలో 2026 అక్టోబర్ 16, 17 తేదీలలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలలో కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాలకు చెందిన కరాటే క్రీడాకారుడు కె. ఆదిత్య సాయి భారతదేశం తరఫున పాల్గొని, అండర్-14 బాయ్స్ కటా విభాగంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. సందర్భం గా పాఠశాల కరస్పాండెంట్ గున్నాల క్రాంతి కుమార్ , కరాటే కోచ్ ఆర్. ప్రసన్న కృష్ణ ఆదిత్య సాయిని అభినందించారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించి దేశానికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచాడని వారు పేర్కొన్నారు.క్రీడల పట్ల ఆసక్తి, క్రమశిక్షణ, నిరంతర సాధనతో ఆదిత్య సాయి ఈ ఘనత సాధించడం అభినందనీయమని తెలిపారు. కోచ్ ఆర్. ప్రసన్న కృష్ణ గారి శిక్షణ, మార్గదర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.భవిష్యత్తులో ఆదిత్య సాయి మరిన్ని ఉన్నత విజయాలు సాధించి దేశానికి మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది ఆదిత్య సాయికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# అన్నదేవరపేటలో ఘనంగా శ్రీ వేగులమ్మ తల్లి అన్నసమారాధన.. 5 వేల మందికి పైగా భక్తుల హాజరు



కొవ్వూరు నీలగిరి వార్తప్రతినిధి,తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామ దేవత శ్రీ వేగులమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న 18వ వార్షిక దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని అనంతరం, భక్తులు అన్నప్రసాద స్వీకరణలో పాల్గొన్నారు. ఈ మహా అన్నసమారాధనలో ఐదు వేలకు పైగా భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు, గ్రామస్తుల సమన్వయం మరియు సహకారంతో ఏర్పాట్లు అద్భుతంగా జరగడంతో భక్తులు అందరూ సంతోషం వ్యక్తం చేశారు.

# కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ తనిఖీలు





కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త: కమిషనర్ ఆదేశాల మేరకు, ఫుడ్ సేఫ్టీ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా శుక్రవారం భిక్నూర్ లోని పలు స్వీట్ షాపుల్లో తనిఖీలు నిర్వహిం చడం జరిగింది. తనిఖీల్లో భాగంగా కొన్ని దుకాణాల్లో గడువు తీరిన ఆహార పదార్థాలు గుర్తించడం జరిగింది. వాటిని అక్కడికక్కడే ధ్వంసం చేయడం జరిగింది.అపరిశుభ్ర వాతావరణం కలిగి ఉన్న దుకాణాలకు నోటీసులు జారీ చేయడం జరిగింది. అనుమానాస్పదంగా ఉన్న ఆహార నమూనాలను సేకరించి, విశ్లేషణ నిమిత్తం ప్రయోగశాలకు పంపడం జరిగింది. ఆహార పదార్థాలను తయారు చేసే వారు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించడం జరిగింది. ప్రయోగశాల నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోబడును.

# ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి

## రైతులకు సూచించిన జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జ్యోతి



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త: భిక్కనూరు మండలం రాగట్లపల్లి గ్రామంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జ్యోతి శుక్రవారం కూరగాయల సాగు పొలాలను సందర్శించి, ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల నేపథ్య ంలో పంటల స్థితిగతులు, నీటి లభ్యతను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడి, కూరగాయల పంటలకు అవసరమైన నీరు అందుబాటులో ఉందా, పంటల పరిస్థితి ఎలా ఉందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పంటలకు అవసరమైన నీరు సరిపోతుందని, కూరగాయల పంటలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు తెలిపారు
ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులు నీటిని పొదుపుగా వినియోగించాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళికను రూపొందించుకోవాలని అధికారులు సూచించారు. నీటి వృథాను అరికట్టి, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా పంటలను కాపాడుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జ్యోతి, ఉద్యాన శాఖ అధికారి సుమన్, ఉద్యాన విస్తరణ అధికారి బాపురెడ్డి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ఈనెల 25,26 తేదీలలో ఛలో హైదరాబాద్ ధర్నా వాల్ పోస్టర్లను విడుదల చేసిన సిఐటియు నాయకులు

- నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలి, కార్మికుల హక్కులు సామాజిక భద్రత కల్పించాలి
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలి
- సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్






కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త: కామారెడ్డి జిల్లా కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో అక్టోబర్ 25, 26 తేదీలలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మల్టిపుల్ డేస్ ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్లను విడుదల చేశారు.
ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, ఉద్యోగులకు పి.ఆర్.సి. అమలు చేయాలని, డి.ఏ. వర్తింపజేయాలని కోరారు.
కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అక్టోబర్ 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరిగే ధర్నాలో వివిధ రంగాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.
అక్టోబర్ 25న పాల్గొనే కార్మికులు, ఉద్యోగులు: పారిశ్రామిక రంగ కార్మికులు, సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్ ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు పాల్గొననున్నారు.
అక్టోబర్ 26న పాల్గొనే కార్మికులు, ఉద్యోగులు: స్కీమ్ వర్కర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, స్థానిక సంస్థల ఉద్యోగులు, యూనివర్సిటీలు, వైద్య ఆరోగ్య రంగ ఉద్యోగులు, పెన్షనర్లు, బీడీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ట్రాన్స్‌పోర్ట్, హమాలీ కార్మికులతో పాటు వివిధ రంగాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు పాల్గొననున్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు, కనీస వేతనాల సాధనకు, ఉద్యోగ భద్రతతో పాటు సామాజిక భద్రత కల్పించేందుకు నిర్వహిస్తున్న ఈ ధర్నాలో కామారెడ్డి జిల్లా నుంచి కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రాజనర్సు, నాయకులు మహబూబ్, ఆయాజ్, ప్రభు, నర్సింగరావు, ప్రభాకర్, యాదారపు రాజు, సాయి, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి

## కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలి

## కేవైసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుండే వెంకటేష్ కురుమ డిమాండ్

గట్టుపల్,నీలగిరి వార్త ప్రతినిధి, అక్టోబర్ 23 : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు, వీరుడు దొడ్డి కొమురయ్య పేరును భావితరాలకు చిరస్మరణీయంగా నిలిపేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుండే వెంకటేష్ కురుమ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం గట్టుపల్ మండల కేంద్రం లో మీడియాతో ఆయన మాట్లాడారు.తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తిని ప్రభుత్వం గుర్తించి తగిన గౌరవం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని కుండే వెంకటేష్ కురుమ పేర్కొన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన పోరాటంలో ఆయన ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. అలాంటి మహనీయుడి సేవలను కేవలం జయంతి, వర్ధంతి కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, ఆయన పేరును శాశ్వతంగా నిలిచిపోయేలా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. వరంగల్ విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టడం ద్వారా ఆయన పోరాట చరిత్రకు తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.

**కురుమల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి**

రాష్ట్రంలో కురుమ సామాజిక వర్గం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. గొర్రెల పెంపకాన్ని ప్రధాన వృత్తిగా చేసుకొని జీవిస్తున్న కురుమ కుటుంబాలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. వృత్తిపై ఆధార పడి జీవించే కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు, విద్య, ఉపాధి, స్వయం ఉపాధి రంగాల్లో ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు.కురుమల సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్పొరేషన్ ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. గొర్రెల పెంపకందారులకు అవసరమైన సహకారం అందించడంతోపాటు, వృత్తిని మరింత లాభదాయకంగా మార్చేందుకు ప్రత్యేక పథకాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి**




దొడ్డి కొమురయ్యకు తగిన గుర్తింపు కల్పించడం, కురుమ సామాజిక వర్గ అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వంటి అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కుండే వెంకటేష్ కురుమ కోరారు. కురుమల చిరకాల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని, దొడ్డి కొమురయ్య చరిత్రను గౌరవిస్తూ ఆయన పేరును చిరస్థాయిగా నిలిపే నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఫామ్ పాండ్ల నిర్మాణంతో భూగర్భ జలాల పెంపు

## రైతులకు అదనపు ఆదాయం





కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త: ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు.రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పర్యటించి, కందూరి భూలక్ష్మి రైతు పొలంలో నిర్మాణంలో ఉన్న వ్యవసాయ క్షేత్రపు నీటి కుంట (ఫామ్ పాండ్) పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతుతో మాట్లాడుతూ, వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్ల నిర్మాణం చేపట్టడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవచ్చని, తద్వారా భూగర్భ జలాల పెంపునకు దోహదపడటంతో పాటు పంటలకు అవసరమైన సమయంలో సాగునీరు అందించుకోవచ్చని తెలిపారు. ఫామ్ పాండ్లలో చేపల పెంపకం చేపట్టడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం లోటు, భూగర్భ జలాల తగ్గుదల వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటల సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని, తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రతి నీటి బొట్టును సమర్థవంతంగా వినియోగించుకుంటూ, నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో తగిన మార్పులు చేసుకోవడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకోవడంతో పాటు రైతులు మెరుగైన ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ దామోదర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్, ఎంపీడీవో నాగేశ్వర్, తహశీల్దార్ ఉమలత, ఏ ఈ పీఆర్ సురేష్, విష్ణువర్ధన్, ఏఈ ట్రాన్స్కో సుధాకర్, ఏపీవో ధర్మారెడ్డి సర్పంచ్ కిషన్ యాదవ్ , ఉప సర్పంచ్ మధుకర్ మరియు పంచాయతీ కార్యదర్శి పాపిరెడ్డి పాల్గొన్నారు.

# వన మహోత్సవంలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

## మొక్కలకు నీరు పోసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:
వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు.
శుక్రవారం రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన మొక్కలకు నీరు పోసే కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ వన మహోత్సవం సందర్భంగా నాటిన మొక్కలకు నీరు పోశారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, అది ఆరోగ్యంగా పెరిగేలా చూడటం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ, అవి ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.
పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకం, సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో నాటిన మొక్కల సంరక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ దామోదర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్, ఎంపీడీవో నాగేశ్వర్, తహశీల్దార్ ఉమలత, ఏఈ పి.ఆర్ సురేష్, ఏఈ ఆర్డబ్ల్యూఎస్ విష్ణువర్ధన్, ఏఈ ట్రాన్స్కో సుధాకర్, ఏపీవో ధర్మారెడ్డి సర్పంచ్ కిషన్ యాదవ్ , ఉప సర్పంచ్ మధుకర్ మరియు పంచాయతీ కార్యదర్శి పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాందాస్ అగర్వాల్ జన్ సేవా సమ్మాన్ జాతీయ పురస్కారానికి డాక్టర్ బాలు ఎంపిక

## లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా చే ఢిల్లీలో అందుకోనున్న జాతీయ పురస్కారం



अन्तर्राष्ट्रीय वैश्य महासम्मेलन
International Vaish Federation
Connecting Vaish world over ...... For community Empowerment
स्व. श्री रामदास अग्रवाल संस्थापक अध्यक्ष

विक्रम सम्वत 2083, 23 अक्टूबर, 2026

"रामदास अग्रवाल जन–सेवा सम्मान"

To,
Shri Neela Balachandram Ji,
H. No. 5-3-895
Vidya Nagar, Nizamabad
District Kamareddy, Telangana 503111
Mob. 94928 74006

सादर नमस्कार,

आपको सूचित करते हुए हर्ष हो रहा है कि दिल्ली में अन्तर्राष्ट्रीय वैश्य महासम्मेलन (IVF) की राष्ट्रीय कार्यसमिति की बैठक का आयोजन IVF के अन्तर्राष्ट्रीय अध्यक्ष डा. अशोक अग्रवाल जी की अध्यक्षता में किया जा रहा है।

समाज के प्रति समर्पण तथा वैश्य समाज के उत्थान के प्रति आपकी सेवाओं से प्रेरणा प्राप्त कर अन्तर्राष्ट्रीय वैश्य महासम्मेलन (IVF) की रामदास अग्रवाल जन–सेवा सम्मान समिति ने आपको सर्वसम्मति से "रामदास अग्रवाल जन सेवा सम्मान" से सम्मानित करने का निर्णय लिया है।

आपसे निवेदन है कि आप कार्यसमिति की बैठक में पधारे। आपको सम्मान प्रदान कर IVF परिवार को गर्व की अनुभूति होगी। कार्यक्रम निम्न प्रकार है:–

National Executive Committee Meeting
& Annual General Body Meeting of IVF

Chief Guest : SHRI OM BIRLA JI
HON'BLE SPEAKER, LOK SABHA

Date: 31st October, 2026 (Saturday)
Venue: Hotel Seven Seas, Sector 3, Rohini, Delhi

MEETING SCHEDULE :
Fellowship Tea : 09.30am to 10.30am
Meeting Session & Samman Samaroh : 10.30am to 7.30pm
*You are requested to join us for Lunch & Dinner.

भवदीय,
रामदास अग्रवाल जन–सेवा सम्मान समिति

श्याम जाजू, वरिष्ठ राष्ट्रीय नेता, भाजपा, राष्ट्रीय सलाहकार, IVF
डा. अनिल अग्रवाल, पूर्व सांसद, राज्य सभा, राष्ट्रीय सलाहकार, IVF
सुरेन्द्र गुप्ता, वरिष्ठ कार्यकारी अध्यक्ष, 9811046294
गोपाल दास खण्डेलवाल, वरिष्ठ कार्यकारी अध्यक्ष, 9311331576
राजीव मित्तल, महामन्त्री, 9770010101
दिनेश चन्द गुप्ता, कोषाध्यक्ष, 98100036241

Head Office : 516, DIF Star Tower, Sector 30, Gurugram, Haryana-122001
Tel.: 9770010101. E-mail : info@vaishivf.com Website : www.vaishivf.com www.facebook.com/VaishIVF




కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త: కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన రాందాస్ అగర్వాల్ జన్ సేవా సమ్మాన్ జాతీయ పురస్కారం 2026 కు ఎంపిక కావడం జరిగింది. ఈ అవార్డును ఈ నెల 31వ తేదీన ఢిల్లీలో నిర్వహించనున్న సమావేశంలో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా చే అందుకోవడం జరుగుతుందని అన్నారు.ఈ పురస్కారానికి అవకాశం కల్పించిన ఐవిఎఫ్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ గంజి రాజమౌళి గుప్త,ఐవిఎఫ్ జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్,రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త, ఐవిఎఫ్ జాతీయ అధ్యక్షులు అశోక్ అగర్వాల్ లకు,ఐవిఎఫ్ తెలంగాణ విభాగానికి,19 సంవత్సరాలుగా సహకరిస్తున్న రక్తదాతలకు, శ్రేయోభిలాషులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ 2007లో రక్తదాన కార్యక్రమాలను కామారెడ్డి కేంద్రంగా ప్రారంభించి నేడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామని, వ్యక్తిగతంగా 84 సార్లు రక్తదానం,తల సేమియా బాధిత చిన్నారుల కోసం 6,000 యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించడం, 350 కి పైగా రక్తదాన శిబిరాలు నిర్వహించి 30 వేల యూనిట్ల రక్తాన్ని అందజేసినందుకు, రక్తదానం పైన అవగాహన కార్యక్రమాలు,సామాజిక సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినందుకు గాను ఈ పురస్కారం అందుకోవడం జరిగిందని అన్నారు.ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో తల సేమియా బాధిత చిన్నారుల కోసం మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహించి వారి ప్రాణాలను కాపాడడం కోసం కృషి చేస్తానని అన్నారు.

# మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపిన

## బి ఆర్ ఎస్ పార్టీ నవాబుపేట మండల అధ్యక్షులు. అంత మల్ల దయాకర్ రెడ్డి నాయకులు





నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవాబుపేట మండలం దసరా పండుగను పురస్కరించుకొని మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే,మాజీ మంత్రి, శ్రీమతి పి. సబితా ఇంద్రారెడ్డి ని నవాబుపేట మండలానికి చెందిన బి.ఆర్.ఎస్. పార్టీ ముఖ్య నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.
శుక్రవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో జరిగిన ఈ కలయికలో నాయకులు శాలువాతో సత్కరించి, పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.
అనంతరం మండలంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై చర్చించారు.
ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి గారు మాట్లాడుతూ.. నవాబుపేట మండల ప్రజలకు, కార్యకర్తలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.
ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, దుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్.పార్టీ మండల అధ్యక్షులు అంత మొల్ల దయాకర్ రెడ్డి బి ఆర్ ఎస్. పార్టీ గౌరవ అధ్యక్షులు భరత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తం చారి,పార్టీ సీనియర్ నాయకులు మాణిక్యం రెడ్డి, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్, కావాలి రాజు,ప్రచార కార్యదర్శి వెంకట్ రెడ్డి, రైతు సంఘ అధ్యక్షులు మల్లేశం,నవాబుపేట మండలానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్ దసరా పురస్కారాలు.. కార్యక్రమంలో పాల్గొన్న కంజర్ల కృష్ణమూర్తి చారి





హైదరాబాద్ నీలగిరి వార్త .. విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసీపి కిరణ్ కుమార్ , గౌరవాధ్యక్షులు ఇడికోజు వెంకటాచారి , ప్రెసిడెంట్ డాక్టర్ తుంపాల వెంకటేశ్వరరావు వైస్ ప్రెసిడెంట్ బంగారు తాతారావు వారి ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్ తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో దసరా పురస్కారాలు మహోత్సవం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి సభా అధ్యక్షులు బ్రహ్మశ్రీ ఎడుకోజు వెంకటాచారి గౌరవ అతిథులు బ్రహ్మశ్రీ విశ్వనాథచారి బ్రహ్మశ్రీ మురుగన్ సెల్వం ఆధ్యాత్మిక గురువులు బ్రహ్మశ్రీశ్రీ వీర ధర్మచ వెంకటాద్రి స్వామి బ్రహ్మశీ పరమ పూజ డాక్టర్ కృష్ణ చాముండేశ్వరి పాల్గొనడం జరిగింది దసరా పురస్కారాలలో భాగంగా వివిధ రంగాల్లో సత్తా చాటిన విశ్వబ్రాహ్మణులకు దసరా పురస్కారాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం పటాన్చెరు నియోజకవర్గ అధ్యక్షులు కంజర్ల కృష్ణమూర్తి పాల్గొనడం జరిగింది, ఈ సందర్భంగా ఎంతో ఘనంగా నిర్వహించిన దసరా పురస్కారాలను నిర్వహించిన విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్ మరియు కె ఎం కిరణ్ కుమార్ కి కృతజ్ఞతలు తెలియజేసి విశ్వ బ్రాహ్మణుల అభ్యున్నతి కోసం ఆయన చేస్తున్న సేవ ఎంతో గొప్పదని ఆయన ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని మన జాతిని ముందుకు తీసుకువెళ్లాలని కోరుకున్నారు.

## శ్రీ పెద్దమ్మ దేవి అన్నప్రసాదం కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త: కామారెడ్డి పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ పెద్దమ్మ దేవి అన్నప్రసాదం కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి ఆశీస్సులతో పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిభావాన్ని, సాంప్రదాయాలను పెంపొందించడంతో పాటు ప్రజల్లో ఐక్యతను చాటుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ ముదిరాజ్ సంఘ అధ్యక్షులు కాళ్ళ గంగరాజు, పున్న రాజేశ్వర్, ఉపాధ్యక్షులు చిట్యాల రమేష్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, నర్సింలు, శెంకర్, ఆశయ్య, రాజు, ముదిరాజ్ సంఘ సభ్యులు, భక్తులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్

### ఇప్ప ఉమారాణి శ్రీనివాస్



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 13వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాల సొంతింటి కల నెరవేరుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, ఇళ్ల నిర్మాణ పనులను నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు మున్సిపాలిటీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ లలిత చిట్టిబాబు, ఆర్వో గోపాల్ రెడ్డి, రాజు కుమార్, వార్డు ఆఫీసర్ వినయ్ ,దీప్తి, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో యువ రైతు ఆత్మహత్య



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త: ఒక యువ రైతు ఆర్థిక ఇబ్బందులతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం కృష్ణాజివాడీ గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామానికి చెందిన దాసరి రమేష్(38) ఆర్థిక ఇబ్బందులతో అప్పుల బాధతో పాటు ఎండల తీవ్రతకు వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పంటకు నీళ్లు అందించే పరిస్థితి లేకపోవడం, కరెంట్ ఇబ్బందులతో, పంట చేనుకు నీళ్లు అందక వరి పంట ఎండిపోయింది. పంటకు పెట్టిన పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేనందున ఆవేదనకు గురయ్యాడు. తీవ్ర ఆందోళనతో ఒత్తిడికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పులు తీర్చే మార్గం లేక రమేష్ (38)మనస్థాపానికి గురై తన పంట చేన్లో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు తాడ్వాయి ఎస్సై నరేష్, ఏఎస్సై కొండల్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## భువనేశ్వర్‌లో జాతీయ పట్టణ సదస్సుకు కమిషనర్ వెంకన్న.



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో అక్టోబర్ 24, 25 తేదీల్లో నిర్వహించనున్న 2వ జాతీయ పట్టణ సదస్సు--2026కు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న హాజరు కానున్నారు. రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ టి.కె. శ్రీదేవి ఆయనను సదస్సుకు నామినేట్ చేశారు.ఈ సదస్సులో తెలంగాణలోని వివిధ మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొననున్నారు. పట్టణాభివృద్ధి, నీటి నిర్వహణ, వ్యర్థాల నియంత్రణ, మౌలిక సదుపాయాలు, మెరుగైన పౌర సేవలపై జరిగే చర్చలు వరంగల్ నగర అభివృద్ధికి ఉపయోగపడనున్నాయి.

# లక్ష్మీపురం వరంగల్ ప్రధాన కూరగాయల మార్కెట్ లో

**వర్తక సంఘం అధ్యక్షుడు జారతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో.**

**ఘనంగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు జన్మదిన వేడుకలు.**



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త , వరంగల్ కూరగాయల మార్కెట్ వర్తక సంఘం ప్రెసిడెంట్ జారతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిధి మన ఎమ్మెల్సీ కె కొండ మురళీధర్ రావు జన్మదిన సందర్భంగా కేకు కటింగు , కూరగాయల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ సెక్రెటరీ కులం సర్వర్ మున్నా కోశాధికారి అల్లూరి బాబురావు మరియు మాజీ కార్పొరేటర్ రమేష్ బాబు, చింతాకుల అనిల్, ఎం ఏ పీ బాబా, కర్రీ వెంకటేశ్వరరావు, పరుష గోపీ, కాసర్ల రాజు, జారతి వెంకటేశ్వర్లు, కారు హరినాథ్ ,శాఖరాతి నాగరాజు, పిన్న మల్లేశం, షేర్ల కుమార్, పరిచే వీరన్న, నేపాల్ రాజు, కొండ హరినాథ్ , షాబాద్ సందీప్, పిన్న రాజేష్ ,786 బిక్షపతి, తోట వినోద్ కుమార్, శరత్, యాకూబ్, అమర్, అమాలి కార్మికులు గుమస్తాలు మహిళలు తోటి వ్యాపారస్తులు భారీ ఎత్తున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సర్వపిండి పై చర్చ

**సరికొత్త నినాదంతో ముందుకెళ్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి.**

**డా.చింతం ప్రవీణ్ కుమార్.**




వరంగల్ బ్యూరో నీలగిరి వార్త. వరంగల్ నల్గొండ ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా.చింతం ప్రవీణ్ కుమార్ వినూత్నంగా తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. తెలంగాణ బ్రాండ్ పిండి వంటకం సర్వ పిండి తో ప్రచారానికి స్వీకారం చుట్టారు. ప్రవీణ్ కుమార్. నిన్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో సర్వపిండి పై చర్చ అనే నినాదాన్ని ప్రారంభించారు. దీని ద్వారా గ్రౌండ్ లెవెల్ కి బలంగా వెళ్లాలనే ఆలోచన చేస్తున్నారు ప్రవీణ్ కుమార్ చింతం. చాయ్ పై చర్చ కార్యక్రమం దేశంలో ఎంతో ప్రఖ్యాతి గాంచింది. అదే విధంగా సర్వపిండి పై చర్చ కూడా అదే విధంగా ప్రజల్లోకి బలంగా వెళ్లి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా విద్యారంగ రాజకీయ సమస్యలను చర్చ పెట్టాలనేదే తన ప్రధాన ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.డాక్టర్ పాక శ్రీధర్,చింతం రాజేశ్వర్,జంగిలి దేవరాజు,మట్ట దుర్గాప్రసాద్, చింతల అనిల్,గోసుల ఆనంద్,తిరుపతి నాయక్, బోడకుంట్ల రవి కుమార్, కెత్త జయశంకర్, చింతం అమర్ వర్మ,వీరబత్తిని శ్యాం సుందర్,వడ్డే శ్రీనివాస్,రుద్ర శ్రీనివాస్,దీపక్ వరియల్,మేకల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘన వ్యర్థాల నిర్వహణకు ఆధునిక సాంకేతికతను వినియోగించాలి.

**కమిషనర్ టి. వెంకన్న.**



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త. గ్రేటర్ వరంగల్ నగరంలో తడి, పొడి చెత్తను వేరు చేసిన అనంతరం ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన ంతో శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకో వాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.శుక్రవారం కమిషనర్ క్యాంపు కార్యాలయంలో ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, ఆస్కి ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఘన వ్యర్థాల నిర్వహణపై సమీక్షించారు. వ్యర్థాల ప్రాసెసింగ్‌కు ఆధునిక విధానాలను అనుసరిస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మహేందర్, ఆస్కి ప్రతినిధి రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# బల్దియాలో టిఆర్ఎస్ జండా ఎగరవేస్తాం

**- ప్రజలకు సుపరిపాలన అందేయడమే టీఆర్ఎస్ లక్ష్యం**

**- రాజధాని రణభేరి సభ లో కవిత ..**





శేరిలింగంపల్లి నీలగిరి వార్త : రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలలో అన్ని డివిజన్ లలో పోటీ చేసి బల్దియా లో టిఆర్ఎస్ జండా ఎగరవేస్తామని ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత అన్నారు. ఉమ్మడి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ వాసిలీ చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గల మియాపూర్ లోని నరేన్ గార్డెన్ లో ఏర్పాటుచేసిన రాజధాని రణభేరి సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మన పట్టభద్రుల ఎమ్మెల్సీ తొలి అభ్యర్థి అయిన శ్రీకాంత్ గౌడ్ ను ఆశీర్వదించాలని కోరారు. ఇక ముందు రాబోయే మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామన్నారు. జి హెచ్ఎంసి లో నీ 300 డివిజన్లలో కూడా కూడా పోటీ చేస్తామని, ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. హైదరాబాద్ ను కేంద్ర పాలిత ప్రాంతం చేస్తామంటే ఒప్పుకోలేదనీ, హైదరాబాద్ 400 ఏళ్ల ఘనమైన చరిత్ర ఉందని, ఆ చరిత్ర ను తెలుసుకోవాలనీ, చరిత్ర తెలవలేనోడు నాయకులు కాలేర్ అన్నారు. హైదరాబాద్ నగరంలో కోటి మంది జనాభా కు కావాల్సిన అవసరాలు ఇప్పుడున్న ప్రభుత్వం తీర్చడం లేదని, మనం ఆ అవసరాలు తీర్చాలనీ పేర్కొన్నారు.వందల ఏళ్ల క్రితం ముత్యాలను సృష్టించిన ఘనత సైబరాబాద్ కు ఉందని ఇపుడు ఐటీ రంగంలో ప్రపంచంలోనే ప్రత్యేక స్థానంలో ఉందని, ఐటీ ఉద్యోగుల కోసం ఒక పాలసీ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పెట్టుబడిదారులకు స్వాగతం పలకాలని, కానీరేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నాడనీ, మళ్ళీ వచ్చే ఆర్థిక సమ్మిట్ లో ఏం చేస్తారో చెప్పండనీ కోరారు.డమ్మీ సమ్మిట్ ల పేరుతో రావద్దని హెచ్చరించారు.

మన టి ఆర్ ఎస్ పార్టీకి కమిట్ మెంట్ ఉన్న కార్యకర్తలు కావాలనీ సూచించారు. విశ్వ నగరం అని చెప్పుకుంటున్నాం కానీ నగరంలో మంచి నీళ్ళు లేవనీ నీళ్లు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వాన్ని ఇప్పుడే చూస్తున్నా మన్నారు.

మన వాళ్ళు గల్లిల్లో తిరగాలనీ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలనీ. ప్రజల కోసం పని చేద్దామని పిలుపు నిచ్చారు. చెత్త గురించి అయితే చెప్పాల్సిన పనే లేదనీ, నగరంలో ఉన్న 50 వేల మంది కార్మికుల పొట్టకొడుతున్నా రనీ. ఇది న్యాయమా అని ప్రశ్నించారు. అలా చేస్తే చూస్తూ ఊరుకో మనీ. సీఎం ఇంటిముందు చెత్త పోసి నిరసన తేలుపుతామన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం కూరగాయలు అమ్మే వారికి ఏసీ ఆటోలు ఇవ్వాలనీ కోరారు. నగరంలోని రోడ్ల కోసం11 వేల నిధులున్నాయనీ, కానీ రోడ్లు మాత్రం గుంతల మయంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. గర్భిణీ ల గురించి. ముసలలోల్ల గురించి ఆలోచించాలనీ రోడ్లు బాగు చేయాలని కోరారు. కుక్కల, దోమల బెడద ఎక్కువగా ఉందని, దోమ లు టవర్లు కట్టాయనే వీడియో సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతుందన్నారు. హైదరాబాద్ నగరం ది ఏ ఆలత్ ఉండేదని ఏం అలత్ అయిందన్నారు.

అన్నిట్లో అవినీతే మిగిల్చారనీ, మంచి మార్పు కోసమే పార్టీ పెట్టామనీ పేర్కొన్నారు.మానవత్వం తో కూడిన పాలన రావాలనీ, హైదరాబాద్ చుట్టూ కూరగా యలు పండించాలి. కానీ రెడ్డి బ్రదర్స్ వల్ల అన్ని పంటలు పోయాయన్నారు. యువత కోసం కొత్త తరం ఆలోచనలతో ముందుకు వెళ్తామన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీ అద్వర్యంలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

శేరిలింగంపల్లి నీలగిరి వార్త..

తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధినాయకత్వం ఆదేశాల తీన్మార్ మల్లన్న మేరకు మా ఇన్చార్జి బందారపు నర్సయ్య గౌడ్ సూచనల మేరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో పండుగల సాయన్న 174వ జయంతిని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారి రమేష్ యాదవ్ అడ్వకేట్ మరియు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మింగని నర్సింగ్ ముదిరాజ్ , కురుమూర్తి ముదిరాజ్ హాఫీస్ పెట్ డివిజన్ అధ్యక్షుడు జాంగిర్, సంతోష్, తిమ్మయ్య, దుర్గమ్మ,రాములమ్మ రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీమతి బండారు విజయలక్ష్మి, బీసీ నాయకులు రామకృష్ణ గౌడ్, నరసింహ ముదిరాజ్ తెలంగాణ రాజ్యాధికార పార్టీ సీనియర్ నాయకుడు పల్లపు యాదయ్య మరియు చెట్టు శీను ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బండారి రమేష్ యాదవ్ మాట్లాడుతూ పండుగ సాయన్న షాద్నగర్ నియోజకవర్గం నవపేట్ మండల్ లో జన్మించి తన జానపద కళా నైపుణ్యంతో భూస్వాములను అన్యాయాలను జానపద కళా రూపంలో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి భూస్వాములపై తిరగబడి భూస్వాముల ధనధాన్యాలు పేదవారికి పంచడం జరిగింది . ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ్ ముదిరాజ్ మాట్లాడుతూ పండుగ సాయన్న యొక్క గొప్ప కళాకారుడని ఆయన పేదల పక్షపాతి అని భూస్వాములను పెట్టుబడిదారులపై పోరాటం చేసి బడుగు




బలహీన వర్గాలకు ఆ సంపదని పంచిపెట్టడం జరిగిందని అందుకే ఆయనను తెలంగాణ రాబిన్ హుడ్ గా పిలుస్తారని నర్సింగ్ ముదిరాజ్ కొని యాడడం జరిగింది రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ పండుగ సాయన్న యొక్క వీర పోరాటాలను స్మరించుకుని ఆయన బాటలోనే ప్రయాణిస్తామని శ్రీమతి విజయలక్ష్మి తెలియ జేయడం జరిగింది

# తూర్పులో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్ ఆధ్వర్యంలో

**ఘనంగా మాజీ ఎమ్మెల్సీ కొండ మురళీధర్ రావు జన్మదిన వేడుకలు.**





వరంగల్ బ్యూరో నీలగిరి వార్త. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు జన్మదిన సందర్భంగా భారీ కేక్ కట్ చేసి మున్సిపల్ పారిశుద్ధ కార్మికులకు వెయ్యి మందికి దుప్పట్లు పంపిణీ చేసి అనంతరం మహా అన్నదానాన్ని ప్రారంభించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్ వరంగల్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ లు వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని వరంగల్ చౌరస్తాలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి మున్సిపల్ కార్మికులకు వెయ్యి మందికి దుప్పట్ల పంపిణీ చేసి అనంతరం మహా అన్నదానాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్ వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ లు మాట్లాడుతూ కొండా మురళీధర్ రావు గ వంచనగిరి సర్పంచుగా రాజకీయ రంగ ప్రవేశం చేసి గీసుకొండ మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా వంచనగిరి సొసైటీ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికై వరంగల్ డి సి బి చైర్మన్ గా ఎన్నికై రెండుసార్లు ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికై సుదీర్ఘ కాలం పాటు వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజలకు సేవ చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు తన సొంత భూమి ఇచ్చి వంచనగిరి మోడల్ స్కూల్ కానీ పరకాల శాయంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల స్కూల్స్ గాని అగ్రంపాడు జాతరలో తనటీ సొంత భూమిని ఇచ్చిన గొప్ప నాయకుడని కొనియాడారు వారి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఉన్నత పదవులు అధిరోహించాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు అన్నారు వరంగల్ తూర్పు నియోజకవర్గం లో గోపాల నవీన్ రాజు ఆధ్వర్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం లో అనేక సాంఘిక సేవ కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కురిమిళ్ళ సంపత్ మబ్బు ప్రవీణ్ సయ్యద్ వాసిం మాజీ కార్పొరేటర్ కత్తెరసాల వేణుగోపాల్ జారతి రమేష్ బసవరాజ్ కుమార్ బాలేనా సురేష్ ఓని భాస్కర్ వాస్కుల బాబు బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్ భోగి సువర్ణ సురేష్ ఎలగం లీలావతి సత్యనారాయణ కేడల పద్మ, మేడిది రజిత, మధుసూదన్ ,నాగపూరీ కల్పనా, సంజయ్ బాబు, చింతాకుల అనిల్, వల్లం పద్మ రవి, డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ నాయకులు కొండా దంపతుల అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గడువు ముగిసే సమయానికి 107 నామినేషన్లు



కొవ్వూరు నీలగిరి ప్రతినిధి కొవ్వూరు మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 23 తో ముగిసింది. మూడో రోజు నామినేషన్ల గడువు ముగిసే సమయానికి వివిధ రాజకీయ పార్టీలు మరియు స్వతంత్ర అభ్యర్థుల నుంచి మొత్తం 107 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి ఎంవిఆర్ సాయిబాబా తెలిపారు. ?పార్టీల వారీగా చూస్తే తెలుగుదేశం పార్టీ తరపున 42, వైఎస్ఆర్‌సీపీ తరపున 39, జనసేన పార్టీ తరపున 21, భారతీయ జనతా పార్టీ తరపున 2 మరియు స్వతంత్ర అభ్యర్థులు 3 చొప్పున మొత్తం 107 మంది నామినేషన్లు సమర్పించారు. ?నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తొలి రోజు వివిధ పార్టీల నుంచి మొత్తం 13 నామినేషన్లు రాగా, అందులో జనసేన నుంచి 2, టీడీపీ నుంచి 2, వైసీపీ నుంచి 7, ఇండిపెండెంట్ల నుంచి 2 చొప్పున దాఖలయ్యాయి. ఇక రెండవ రోజు నామినేషన్ల జోరు మరింత పెరిగి ఏకంగా 49 నామినేషన్లు అందాయి. మూడవ రోజు గడువు ముగిసే సమయానికి అభ్యర్థులు మరో 45 నామినేషన్లు వేశారు. మొత్తంగా కొవ్వూరు మండలంలో ఎంపీటీసీ ఎన్నికలకు నామినేషన్ల పర్వం హోరాహోరీగా సాగింది. పట్టణ సీఐ విశ్వం ఆధ్వర్యంలో కొవ్వూరు రూరల్ ఎస్ఐ శ్రీహరి, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు

## ఎంపీటీసీ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా రామకృష్ణ నామినేషన్ దాఖలు



కొవ్వూరు నీలగిరి వార్త ప్రతినిధి తాళ్లపూడి మండల పరిధిలోని ఎంపీటీసీ-1 స్థానానికి బీజేపీ అభ్యర్థిగా ఇందుగుల రామకృష్ణ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం ఉత్సాహపూరిత వాతావరణంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారుల కార్యాలయానికి చేరుకున్న ఆయన, తన నామినేషన్ పత్రాలను అధికారికంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనకు ఘనంగా సంఘీభావం తెలిపారు.నామినేషన్ పత్రాలు సమర్పించిన అనంతరం ఇందుగుల రామకృష్ణ మాట్లాడుతూ... తాళ్లపూడి-1 పరిధిలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, స్థానిక ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పార్టీ శ్రేణులతో కలిసి సైనికుడిగా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ కార్యక్రమానికి విచ్చేసిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు . స్థానిక నాయకుల మద్దతుతో ఎన్నికల్లో విజయం సాధిస్తామని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేశాయి.

## కొవ్వూరు 16వ వార్డులో హోరెత్తిన ఎన్డీఏ కూటమి ఎన్నికల ప్రచారం



కొవ్వూరు నీలగిరి వార్త ప్రతినిధి , కొవ్వూరు పట్టణ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం 16వ వార్డులో ఎన్డీఏ కూటమి ఎన్నికల ప్రచారం హోరెత్తింది. ఈ ప్రచార కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి కంఠమణి విజయలక్ష్మి మరియు 16వ వార్డు జనసేన పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ముత్యాల సాయి కుమారి ఉత్సాహంగా పాల్గొని, వార్డులోని ఇంటింటికీ తిరుగుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కూటమి బలపరిచిన తమకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు
ఈ కార్యక్రమానికి వార్డు ప్రజల నుండి అపూర్వ స్పందన లభించింది. మాజీ మున్సిపల్ చైర్మన్లు జొన్నలగడ్డ రాధారాణి, సూరపనేని చిన్నితో పాటు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున ఈ ప్రచారంలో పాల్గొన్నారు
పట్టణ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ముందుకు సాగుతోందని నాయకులు ఈ సందర్భంగా తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను మీ అమూల్యమైన ఓటుతో అఖండ మెజార్టీతో గెలిపించాలని వారు వార్డు ప్రజలను సవినయంగా అభ్యర్థించారు.

## కొవ్వూరు10వ వార్డులో కూటమి ఎన్నికల ప్రచారం జోరు



కొవ్వూరు నీలగిరి వార్త ప్రతినిధి, కొవ్వూరు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో కూటమి జనసేన పార్టీ అభ్యర్థి దేగల రామ్ కుమార్ ఎన్నికల ప్రచారం శుక్రవారం ఉత్సాహంగా సాగింది వార్డులోని ప్రతి ఇంటికి తిరిగి, కూటమి చైర్మన్ అభ్యర్థిగా బరిలో నిలిచిన కంఠమణి విజయలక్ష్మిని పదో వార్డ్ కౌన్సిలర్ తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వార్డు ప్రజలను ఆప్యాయంగా కలుసుకుంటూ, రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించారు.ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా స్థానిక సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకుంటూ, కూటమి అభ్యర్థిని గెలిపిస్తే వార్డును అన్ని రంగాల్లోనూ ఆదర్శంగా అభివృద్ధి చేస్తామని ఓటర్లకు లకు దేగల రాంకుమార్ హామీ ఇచ్చారు.

# నవంబర్ 6న ఉర్సు గుట్ట జరిగే నరకాసుర వద కార్యక్రమానికి

**వరంగల్ నగర కమిషనర్ ఎన్ శ్వేతా కి వినతిపత్రం అందించిన. నరకాసుర వద నిర్వహణ కమిటీ సభ్యులు.**



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త. దీపావళి పండుగ సందర్భంగా నరుకా సురవధ ఉత్సవములు సజావుగా సాగడానికి పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయిస్తానని నగర కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్వేత అన్నారు గురువారం రోజున నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరుపల్ల రవి ఆధ్వర్యంలో కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్వేత కు వినతిపత్రం ఆహ్వాన పత్రికను అందజేసినారు నరకాసురవద ఉత్సవంలో 58 ఫీట్ల ఎత్తుగల భారీ విగ్రహం నరకాసురుని భారీ విగ్రహం నకు బాంబులు అమర్చి పేల్చివేస్తామని సాయంత్రం ఐదు గంటల నుండి సాంస్కృతిక కార్యక్రమాలు నడుస్తాయని ఈ నరకాసుర వద ఉత్సవముల కార్యక్రమానికి వరంగల్ తూర్పు నియోజకవర్గ శాసన సభ్యురాలు కొండ సురేఖ తో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు జిల్లా అధికారులు వేలాది మంది భక్తులు పాల్గొంటారని ఉర్సు ప్రతాప్ నగర్ నుండి ఉర్సు గుట్ట వరకు శ్రీకృష్ణ సత్యభామ వేషధారణతో డబ్బు చప్పుళ్లతో పురవీధుల గుండా ఊరేగింపుతో వస్తుందని అధ్యక్షులు మరుపల్ల రవి కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్వేతకు ఉత్సవములు జరుగు తీరును వివరించినారు
సిపి శ్వేత మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులకు ప్రజలకు అధికారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బ్యారికెట్లు ఏర్పాటు చేయాలని ఆమె కార్యవర్గమునకు తెలిపినారు వినతి పత్రం ఆహ్వాన పత్రికను అందజేసిన వారిలో నరకాసుర వధ ఉత్సవ కమిటీ ప్రతినిధులు మరుపల్ల గౌతం, దూడ బాల, కొమురెల్లి వనం కుమార్, ఆవునూరి రామన్న, మాటేటి శ్యామ్, కుండె రాజు, అవునూరి ఐలేశం కుండె సదానందం, దాసరి రాజు పోలం రంజిత్ లు ఉన్నారు.

# పెండింగ్ సెక్షన్లకు ఆమోదం కల్పించాలి

**దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు యుగంధర్ యాదవ్.**

**అక్టోబర్ 26న మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష.**



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త. వరంగల్ అక్టోబర్ 23: రైల్వే రన్నింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న అన్ని అర్హత కలిగిన హ్యాండిక్యాప్డ్, పైలట్ సెక్షన్లకు తక్షణమే ఆమోదం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు యుగంధర్ యాదవ్ తెలిపారు. ఈ నెల 26న సికింద్రాబాద్‌లోని సంచలన్ భవన్ వద్ద నిరాహార దీక్ష నిర్వహించనున్నట్లు సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ దీక్ష కొనసాగుతుందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ సెక్షన్లకు సంబంధించి ఆమోదం కోసం పంపిన ప్రతిపాదనల్లో 11 సెక్షన్లకు ఈ నెల 21న ఆమోదం లభించిందని, మిగిలిన సెక్షన్లకు ఇంకా అనుమతులు రాకపోవడం ఆందోళన కలిగిస్తోందని యుగంధర్ యాదవ్ పేర్కొన్నారు. అర్హత కలిగిన అన్ని సెక్షన్లకు సమాన న్యాయం జరిగేలా పెండింగ్ ప్రతిపాదనలను వెంటనే పరిశీలించి ఆమోదించాలని రైల్వే అధికారులను కోరారు.లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు రైళ్ల సురక్షిత నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి విధుల స్వభావం, పని ఒత్తిడి, విశ్రాంతి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ప్రతి సైన్-ఆన్ నుంచి సైన్-ఆఫ్ వరకు కనీసం 120 కిలోమీటర్ల అలవెన్స్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని యూనియన్ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.ఈ నిరాహార దీక్షలో లోకో, ట్రాఫిక్ శాఖల రన్నింగ్ సిబ్బందితో పాటు వివిధ శాఖల ఉద్యోగులు, యూనియన్ డివిజనల్ కార్యవర్గ సభ్యులు, బ్రాంచ్ కార్యదర్శులు, చైర్మన్లు, ఇతర ప్రతినిధులు, మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని యుగంధర్ యాదవ్ పిలుపునిచ్చారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, పెండింగ్ సెక్షన్లకు ఆమోదం సాధించడం, రన్నింగ్ సిబ్బంది సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడమే దీక్ష ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు యూనియన్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికలో వైఎస్సార్సీపీ దూకుడు



కొవ్వూరు నీలగిరి వార్త ప్రతినిధి
కొవ్వూరు : కొవ్వూరు మున్సిపల్ ఎన్నికల ప్రచారం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది. కొవ్వూరులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ ముఖ్య నేతలు ప్రచార రంగంలోకి దిగారు. శనివారం పార్టీ ముఖ్య నాయకులు చైర్మన్ అభ్యర్థి గంట్రోతు అంజలీదేవి వార్డు కౌన్సిలర్లతో ప్రచారంలో పాల్గొన్నారు. పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. జిల్లా ఇన్‌చార్జ్, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యువజన అధ్యక్షుడు జక్కంపూడి రాజా, పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్, నియోజవర్గ ఇన్చార్జ్ తలారి వెంకట్రావు రాష్ట్ర కార్యదర్శి తోట రామకృష్ణ తదితరులు కొవ్వూరులో విస్తృతంగా పర్యటించి అధికార కూటమి ప్రభుత్వంపై విమర్శల దాడిని తీవ్రం చేశారు.
ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారని, రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని ఆయన ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరిస్తూ, కొవ్వూరు మున్సిపాలిటీలోని ప్రతి వార్డులోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను, అలాగే చైర్‌పర్సన్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.
మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్ష నేతల నామినేషన్ల ప్రక్రియను అడ్డుకునే కుట్రలు జరుగుతున్నాయని రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ పరిణామాలన్నింటినీ ప్రజలు గమనించాలని, మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల వైపు నిలబడి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మొత్తానికి, ప్రతి వార్డులోనూ పట్టు సాధించడమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ నేతలు వ్యూహాలు రచిస్తుండటంతో కొవ్వూరు రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. స్థానిక సంస్థల సమరంలో ఓటర్ల తీర్పు ఏ విధంగా ఉండబోతుందనేది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

## శభాష్ వంశిక.. జాతీయస్థాయి క్రికెట్‌కు ఎంపికైన విద్యార్థినిని అభినందించిన కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 23 'వంశిక శభాష్.. జాతీయస్థాయి క్రికెట్‌కు ఎంపికకావడం గర్వకారణం'అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. విద్యార్థిని క్రీడాప్రయాణానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని గూడెపు వంశిక శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసింది. ఆమె క్రికెట్‌లో సాధించిన విజయాలు, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన తీరు, భవిష్యత్తు లక్ష్యాల గురించి కేటీఆర్ వివరాలు తెలుసుకున్నారు. వంశిక సాధించిన విజయానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు కుంట శ్రీనివాస్‌ను, ఆమెకు ప్రోత్సాహం అందించిన పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు.
రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన వంశిక
అక్టోబర్ 10 నుంచి 13 వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో వంశిక అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. నవంబర్ మొదటి వారంలో జమ్ముకశ్మీర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వంశిక తెలంగాణ తరపున ఆడనున్నది. జాతీయ స్థాయికి ఎంపికకావడం పాఠశాలతో పాటు నామాపూర్ గ్రామానికి గర్వకారణంగా నిలిచింది.

# పండుగ వేళ ఎథ్నిక్ లుక్‌లో పూజా హెగ్డే.. గ్లామర్ డోస్ అదుర్స్! స్లీవ్‌లెస్

పండుగ వేళ ఎథ్నిక్ లుక్‌లో పూజా హెగ్డే.. గ్లామర్ డోస్ అదుర్స్! టాలీవుడ్, బాలీవుడ్‌లలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా దూసుకెళు_న్న పూజా హెగ్డే ఫ్యాషన్ ట్రెండ్స్‌ను సెట్ చేయడంలో ఎప్పుడూ ముందే ఉంటారు. తనదైన గ్లామర్, స్టైలిష్ లుక్స్‌తో ఎంతోమంది డిజైనర్లకు మ్యూజ్‌గా మారిన ఈ బుట్టబొమ్మ, ఏ దుస్తులు వేసినా దానికి మరింత అందాన్ని తీసుకువస్తారు. తాజాగా హైదరాబాద్‌లో జరిగిన ఒక గ్రాండ్ ఈవెంట్‌లో పాల్గొన్న పూజా హెగ్డే, తన ఎథ్నిక్ ఫ్యాషన్ సెన్స్‌తో మళ్లీ అందరి దృష్టిని ఆకర్షించారు. ఆ ఫెస్టివ్ వేడుక విశేషాలు ఇప్పుడు చూద్దాం.. ౼ాశ్రీంశీ =ముం - ఆస్ట్రేలియా వీధుల్లో స్టైలిష్‌గా కయాదు లోహర్.. ఫ్యాన్స్ ఫిదా! హైదరాబాద్‌లో లైఫ్‌స్టైల్ ఫెస్టివ్ కలెక్షన్ లాంచ్: హైదరాబాద్‌లో లైఫ్‌స్టైల్ స్టోర్స్ నూతన బ్రాంచ్‌లు ప్రారంభమయ్యాయి. ఈ స్టోర్స్ ఓపెనింగ్ ఈవెంట్‌లో పాల్గొన్న పూజా హెగ్డే.. లైఫ్‌స్టైల్ యొక్క స్పెషల్ ఫెస్టివ్ కలెక్షన్' ఎథ్నిక్ వైబ్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఇక ఈ పండుగ సీజన్‌కు తగ్గట్టుగా రూపొందించిన రకరకాల డిజైనర్ కుర్తీలు, పండుగ దుస్తులు, రాయల్ పాదరక్షలు మరియు ట్రెండీ క్లచ్‌లను ఆమె ఆవిష్కరించి సందడి చేశారు. ఎథ్నిక్ ఫ్యూజన్ సెట్‌లో అదరగొట్టిన బుట్టబొమ్మ: ఈవెంట్‌లో పూజా హెగ్డే ధరించిన టు-పీస్ ఎథ్నిక్ ఫ్యూజన్ అవుట్‌ఫిట్ అందరినీ మంత్రముగ్ధులను చేసింది. స్లీవ్‌లెస్ క్యారెక్టర్‌తో కాలర్-నెక్ ఎంబ్రాయిడరీ వేస్ట్‌కోట్ బ్లౌజ్, దానికి మ్యాచింగ్ ఎంబ్రాయిడరీ మ్యాక్సీ స్కర్ట్ జత చేసి ఆమె చాలా రాయల్‌గా కనిపించారు. బ్లాక్ ఫ్లోరల్ డిజైన్ డ్రెస్‌లో ఆమె చూపిన గ్లామర్ అండ్ స్టైలిష్ లుక్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.



# '418' మూవీ రివ్యూ..

## ప్రశాంత్ నీల్ హారర్ సినిమా భయపెట్టిందా?

నటీనటులు : చైత్ర ఆచార్, సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల, శశాంక్ పాటిల్ తదితరులు
సంగీతం : వెంకీ జీజీ
నిర్మాతలు : నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్
రచన, దర్శకత్వం : కీర్తన్ నాదగౌడ
సమర్పణ : ప్రశాంత్ నీల్
బ్యానర్ : మైత్రి మూవీ మేకర్స్
విడుదల తేదీ : 23 అక్టోబర్ 2026

ప్రశాంత్ నీల్ సమర్పణలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో కీర్తన్ నాదగౌడ తెరకెక్కించిన సైకలాజికల్ హారర్ థ్రిల్లర్ '418'. ప్రశాంత్ నీల్ శిష్యుడు దర్శకత్వం వహించడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మరి ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు భయపెట్టిందో రివ్యూలో చూద్దాం.

కథ

ఊరికి దూరంగా ఉన్న ఓ మెడికల్ కాలేజ్ హాస్టల్‌ను 15 ఏళ్ల తర్వాత తిరిగి తెరుస్తారు. అయితే అందులోని '418' గది మాత్రం ఎప్పటికీ మూసే ఉంటుంది. ఆ గది గురించి తలచుకుంటేనే విద్యార్థులు వణికిపోతుంటారు. ఈ క్రమంలో హాస్టల్‌లోని 417వ గదిలో చేరిన వివేక్ (సూర్య రాజ్)కు వింత అనుభవాలు ఎదురవుతాయి. పీడకలలు, భయంకరమైన దృశ్యాలు అతన్ని వెంటాడుతుంటాయి. తనపై హత్యాయత్నం కూడా జరగడంతో, వీటన్నింటికీ 418వ గదినే కారణమని తెలుసుకుంటాడు. అసలు ఆ గది వెనక ఉన్న రహస్యం ఏంటి? లండన్ నుంచి వచ్చిన సాయేషా (ప్రీతి పగడాల) ఆ గదిని తెరవడానికి ప్రయత్నించినప్పుడు ఏం జరిగింది? అనేది అసలు కథ.

విశ్లేషణ

హారర్ సినిమాల్లో సాధారణంగా కనిపించే మూతపడిన బంగ్లా, ఆత్మ, పాత నేపథ్యం వంటి పాత ఫార్ములానే ఈ చిత్రంలోనూ ఎంచుకున్నారు. కథాకథనంలో పెద్దగా కొత్తదనం కనిపించకపోయినా, దర్శకుడు కీర్తన్ నాదగౌడ సృష్టించిన భయానక వాతావరణం సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది.

సాంకేతిక విభాగం: వెంకీ జీజీ అందించిన నేపథ్య సంగీతం వెన్నులో వణుకు పుట్టిస్తుంది. విజువల్స్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి. యక్షగానం కళా రూపం మరియు కథలోని సైకలాజికల్ కోణం ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి.
నటన: కన్నడ నటి చైత్ర ఆచార్ తన అద్భుతమైన నటనతో సినిమాను తన భుజాన వేసుకున్నారు. సూర్య రాజ్, ప్రీతి పగడాల, చరణ్ లక్కరాజు తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. కొత్త నటులు కావడంతో సినిమాకు సహజత్వం వచ్చింది.

బలాలు
దేవిక పాత్ర చుట్టూ నడిచే ద్వితీయార్థం
భయపెట్టే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ మరియు సినిమాటోగ్రఫీ
చైత్ర ఆచార్ అభినయం
ఆసక్తికరమైన ప్రారంభ సన్నివేశాలు

బలహీనతలు
రొటీన్ కథ మరియు కొత్తదనం లేని స్క్రీన్ ప్లే
క్లైమాక్స్

చివరిగా.. కొన్ని అంచనాలతో థియేటర్లకు వెళ్లే హారర్ జోనర్ ప్రేక్షకులను '418' అక్కడక్కడా మంచి అనుభూతిని పంచుతుంది. భయపెట్టే సన్నివేశాలు కోరుకునేవారికి ఇది పర్ఫెక్ట్ ఛాయిస్!




# ప్రభాస్ బర్త్‌డే స్పెషల్..

## 'స్పిరిట్' సెట్స్ నుంచి సందీప్ రెడ్డి వంగా సర్‌ప్రైజ్ పోస్ట్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు, సినీ ప్రముఖులు ఆయనకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. తమ అభిమాన హీరో పుట్టినరోజు కావడంతో ప్రభాస్ కొత్త సినిమాల నుంచి ఏదైనా ప్రత్యేక ప్రకటన వస్తుందేమోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ క్రమంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా అభిమానులకు ఓ ప్రత్యేక సర్‌ప్రైజ్ ఇచ్చారు. ప్రభాస్‌తో కలిసి 'స్పిరిట్' సినిమా సెట్స్‌లో దిగిన ఫొటోను పంచుకుంటూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ప్రభాస్‌తో సందీప్ రెడ్డి వంగా కలిసి ఉన్న ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో సందీప్ రెడ్డి వంగా చేతిలో మందు బాటిల్ పట్టుకుని ఉండగా, ప్రభాస్ నవ్వుతూ దానిని చూపిస్తూ ఆయనతో మాట్లాడుతున్నట్లు కనిపిస్తున్నారు. ఈ ఫొటోను పంచుకున్న సందీప్ రెడ్డి వంగా.. "అన్నా.. లెట్స్ పార్టీ! ఇవాళ నీ పుట్టినరోజు. పుట్టినరోజు శుభాకాంక్షలు ప్రభాస్ అన్నా" అంటూ తన అభిమానాన్ని చాటుకున్నారు.ప్రభాస్‌తో సందీప్‌కు ఉన్న సాన్నిహిత్యాన్ని ఈ ఫొటో ప్రతిబింబిస్తోందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. తమ అభిమాన హీరో పుట్టినరోజున దర్శకుడు పంచుకున్న ఈ ప్రత్యేక ఫొటోను విపరీతంగా షేర్ చేస్తున్నారు.ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కలయికలో తెరకెక్కనున్న 'స్పిరిట్' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి చిత్రాలతో తనదైన శైలిని చాటుకున్న సందీప్.. ప్రభాస్‌ను ఏ తరహా పాత్రలో చూపించబోతున్నారనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.





# 40 ఏళ్ల నిరీక్షణకు తెర పడనుందా

సినిమా ప్రపంచంలో మల్టీస్టారర్ చిత్రాలకు ఉండే క్రేజ్ ప్రత్యేకం. అందులోనూ సూపర్‌స్టార్ రజినీకాంత్, విశ్వనటుడు కమల్ హాసన్ కలిసి నటిస్తే అభిమానుల ఆనందానికి హద్దులుండవు. దశాబ్దాలుగా తమదైన నటన, ప్రత్యేక శైలితో ప్రేక్షకులను అలరిస్తున్న ఈ ఇద్దరు దిగ్గజ నటులు మరోసారి ఒకే తెరపై కనిపించబోతున్నారనే వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ పేరు వినిపిస్తుండటంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. కాగా, రజినీకాంత్, కమల్ హాసన్‌లకు తమిళ చిత్ర పరిశ్రమలో సుదీర్ఘమైన అనుబంధం ఉంది. 1975లో విడుదలైన 'అపూర్వ రాగంగళ్'తో రజినీకాంత్ వెండితెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత 'అంతులేని కథ', 'మూండ్రు ముడిచు', '16 వయతినిలే', 'అవర్గళ్', 'ఇళమై ఊంజలాడుకిరతు' వంటి పలు చిత్రాల్లో వీరిద్దరూ కలిసి నటించారు. కొన్ని సినిమాల్లో ఒకరు మరొకరి చిత్రంలో ప్రత్యేక పాత్రల్లోనూ కనిపించారు.కాలక్రమేణా ఇద్దరూ తమకంటూ ప్రత్యేకమైన అభిమానగణాన్ని సంపాదించుకున్నారు. రజినీకాంత్ తనదైన శైలి, తెరపై వినూత్నమైన అభినయంతో ప్రేక్షకులను అలరిస్తే.. కమల్ హాసన్ వైవిధ్యమైన పాత్రలు, ప్రయోగాత్మక చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే ఇద్దరూ కలిసి పూర్తిస్థాయిలో నటించే అవకాశం కోసం అభిమానులు చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. నెల్సన్ దిలీప్‌కుమార్ ఈ ఇద్దరు దిగ్గజాలను ఒకే సినిమాలో చూపించనున్నారనే వార్త ఇప్పుడు చర్చనీయాంశమైంది.

# బాక్సాఫీస్ డౌన్.. కాస్ట్ ఆఫ్ సెక్యూరిటీ అప్:

## గండంలో స్టార్ హీరో మార్కెట్!

బాక్సాఫీస్ డౌన్.. కాస్ట్ ఆఫ్ సెక్యూరిటీ అప్: గండంలో స్టార్ హీరో మార్కెట్! బాలీవుడ్‌లో దశాబ్దాలుగా తిరుగులేని బాక్సాఫీస్ సామ్రాజ్యాన్ని ఏలిన భాయ్‌జాన్ సల్మాన్ ఖాన్ కెరీర్ ప్రస్తుతం అత్యంత సవాలుతో కూడిన మలుపులో పడింది. ఒకప్పుడు సింగిల్ హ్యాండ్‌తో రికార్డులను బద్దలు కొట్టిన స్టార్ హీరో, ఇప్పుడు బాక్సాఫీస్ ఫలితాలకే



పరిమితం కాకుండా ఊహించని భద్రతా సవాళ్లను కూడా ఎదుర్కొంటున్నారు. ఈ సరికొత్త పరిణామాల నేపథ్యంలో బాలీవుడ్ నిర్మాతలలో వ్యక్తమవుతున్న ఆలోచనా ధోరణి.. సినిమా ఇండస్ట్రీలో నూతన చర్చకు తెరలేపింది. ౼ాశ్రీంశీ =ముం - ఆస్ట్రేలియా వీధుల్లో స్టైలిష్‌గా కయాదు లోహర్.. ఫ్యాన్స్ ఫిదా! సల్మాన్ ఖాన్ గత సినిమాలైన -కిసీ కా భాయ్ కిసీ కీ జాన్-.. అలాగే ఇటీవలి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడం ఆయన మార్కెట్ పై కొంత ప్రభావాన్ని చూపింది. కేవలం స్టార్ డమ్ ఉంటే సరిపోదని.. నేటి ప్రేక్షకుల రుచికి తగినట్లుగా బలమైన కంటెంట్ కూడా ఉండాలని ఈ ఫలితాలు నిరూపించాయి. ఈ నేపథ్యంలో నిర్మాతలు ఆయనతో కొత్త ప్రాజెక్ట్‌లను ప్రకటించే విషయంలో పునరాలోచనలో పడటం గమనార్హం. ఈ బాక్సాఫీస్ ఆందోళనల కంటే ఎక్కువగా? సల్మాన్ ఖాన్ చుట్టూ అల్లుకున్న భద్రతా సమస్యలు చిత్ర పరిశ్రమను కలవరపెడుతున్నాయి.

Printed by HAMARA WARANGAL PRINTERS AND GRAPHICS Published by GUNDLA SRINIVAS on behalf of GUNDLA SRINIVAS, printed at WARANGAL and published at H-NO: 2-55, PEDDAPUR VENKATAPUR MANDAL, PEDDAPUR, WARANGAL, TELANGANA - 506168. editor CHENNA RAMA KRISHNA.9573317147,8096914960